క్లుప్తంగా

పోస్టల్ బ్యాలెట్ సేకరణ కేంద్రం ఏర్పాటు


దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ అధికారి, మైక్రో అబ్జర్వర్‌గా విధులు నిర్వహించేందుకు నియమితులైన వారికి పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించేందుకు నియోజకవర్గ పరిధిలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ఫారం-12 సేకరణ కేంద్రం ఏర్పాటు చేసినట్టు కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్‌కుమార్ బుధవారం వెల్లడించారు. ఈ కేంద్రంలో నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగి ఉన్న మైక్రో అబ్జర్వర్, ఓపీఓలు ఫారం-12ను భర్తీ చేసి, ఎన్నికల విధుల ఉత్తర్వుల కాపీ, ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఈ నెల 22లోగా అందజేయాలని కోరారు.

రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో..


తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ అధికారి, మైక్రో అబ్జర్వర్‌గా విధులు నిర్వహించేందుకు నియమితులైన వారి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఫారం-12 సేకరణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ మేరకు రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ ఎన్.తేజ్‌భరత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రంలో 51-రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగి ఉన్న మైక్రో అబ్జర్వర్, ఓపీఓలు ఫారం-12ను భర్తీ చేసి, ఈ నెల 22లోగా అందజేయాలని కోరారు.

బీసీవై రూరల్ అభ్యర్థిగా శ్రీదేవి


దుగ్గిరాల శ్రీదేవి

రాజమహేంద్రవరం రూరల్: భారత చైతన్య యువజన పార్టీ(బీసీవై) నుంచి రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్నట్టు దుగ్గిరాల శ్రీదేవి వెల్లడించారు. బుధవారం హుకుంపేటలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు, మహిళా సాధికారత, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే బీసీవై లక్ష్యమన్నారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ తనకు టికెట్ కేటాయించారన్నారు.

రామ నామమే రక్షణ కవచం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): శ్రీరామ నామం మానవాళికి రక్షణ కవచం లాంటిదని భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతి స్వామిజీ అన్నారు. బుధవారం నగరంలో 'శ్రీరామ శోభా యాత్ర' బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. బీజేపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి డి.పురంధేశ్వరి, బీజేపీ నాయకులు, జైన్ సంఘ సభ్యులు, శ్రీరామా ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి, బండ్ల రామశంకర్, తాడజు హరి పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కంబాలచెరువు: గోదావరి నదిలో రాజమహేంద్రవరం పుష్కర్‌ఘాట్ వద్ద సుమారు 60 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం బుధవారం లభ్యమైంది. పుష్కర్‌ఘాట్ వద్ద నదిలో ఆమె మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, ఆమె వద్ద ఆధారాల కోసం యత్నించారు. ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ వీరయ్యగౌడ్ తెలిపారు.

వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాలి

ప్రకాశం నగర్: మొండి వైఖరిని విడనాడి పేపర్ మిల్లు యాజమాన్యం వెంటనే వేతన ఒప్పందం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరుణ్ మాట్లాడుతూ పేపరు మిల్లులో కార్మిక సంఘాలు చట్టబద్ధంగా చేపట్టిన సమ్మె 17వ రోజుకు చేరిందని తెలిపారు. మిల్లులో ప్రతి రెండేళ్లకు కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించి, మూడున్నరేళ్లకోసారి వేతన ఒప్పందం చేయాల్సి ఉందన్నారు. వేతన ఒప్పందం 2020 జూన్‌లో ముగిసినప్పటికీ, ఇప్పటి వరకు వేతన ఒప్పందం చేయలేదన్నారు. కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలకు సైతం ఆటంకాలు సృష్టించిందన్నారు. వేతన ఒప్పందం చేసుకోవాలని కార్మిక శాఖ ఉన్నతాధికారులు సూచించినప్పటికీ, యాజమాన్యం ఆ దిశగా చొరవ చూపలేదన్నారు. కార్మిక సంఘాల జేఏసీ జిల్లా కలెక్టరుకు విన్నవించుకోవడంతో యాజమాన్యాన్ని చర్చలకు పిలిచారని, ఆ చర్చలకు సైతం గైర్హాజరయ్యారని చెప్పారు. వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు జేవై దాసు, వెంకటేశ్వరరావు, కృష్ణ, కర్రి రాజేష్, బి.మురళి, సుబ్రహ్మణ్య నాయుడు, సత్తిరాజు, శ్రీనివాసరెడ్డి, పి.వీరబాబు, హరిబాబు, శ్రీను మాట్లాడుతూ వేతన ఒప్పందం కోసం కార్మిక సంఘాల ఆందోళనల నేపథ్యంలో మూడేళ్లలో 40 సార్లు సమావేశాలు జరిగాయని తెలిపారు. యాజమాన్యం మొండి వైఖరితో సమస్యలు పరిష్కారం కాలేదన్నారు.

జగన్ కోసం జన గోదారి ఎదురుచూపు

- నేడు గోదారి తీరానికి 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర
- ఆతృతగా ఎదురు చూస్తున్న గోదావరివాసులు
- ఏర్పాట్లలో అధికార యంత్రాంగం, పార్టీ శ్రేణులు తలమునకలు




ట్రయల్ రన్ కోసం కడియపులంక వచ్చిన సీఎం బస్సు

ఇచ్చిన మాటను నెరవేర్చే వరకూ విశ్రమించని నిరంతర శ్రామికుడు.. అవ్వాతాతలకు.. ఆడ బిడ్డలకు.. ఆర్థికంగా వెనుకబడ్డ అన్ని వర్గాలకూ నేనున్నానంటూ అండగా నిలిచిన సంక్షేమ సారథి రాకతో గోదావరి తీరం పులకించనుంది. ముందెన్నడూ ఊహించని రీతిలో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి.. తమ జీవన ప్రమాణాలను గణనీయంగా మెరుగు పరిచి.. జన హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక కోసం ఇక్కడి ప్రజానీకం ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. ఎప్పుడెప్పుడు ఆ జననేతను కళ్లారా చూస్తామా అంటూ వేచి చూస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర.. గోదావరి చెంతకు చేరుతుండడంతో గోదావరి వాసుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఐదేళ్ల సమర్థ పాలనతో ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చేందుకు మేమంతా సిద్ధమంటూనే.. జన నాయకుడికి అపూర్వ స్వాగతం పలికేందుకు సన్నద్ధమయ్యారు. రోడ్ షో కొనసాగే మార్గమంతా జన గోదారి ఉప్పొంగనుంది. ముఖ్యమంత్రి పర్యటనతో అధికార యంత్రాంగం అన్ని విధాలా సన్నద్ధమైంది. ఎన్నికలు ప్రకటించిన తర్వాత తొలిసారి ఇక్కడకు వస్తున్న జన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనతో పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, కేడర్‌లో ఉత్సాహం ఉవ్విళ్లూరుతోంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ పర్యటన వారిలో నూతనోత్తేజం నింపనుంది.

నేడు రాజమహేంద్రవరంలో సీఎం జగనన్న రోడ్డు షో

- నగరంలో 7 కి.మీ. మేర సాగనున్న యాత్ర
- ఎంపీ భరత్‌రామ్ వెల్లడి


ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా గురువారం రాజమహేంద్రవరంలో రోడ్ షో జరుగనున్నదని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ బుధవారం తెలిపారు. రావులపాలెం పొట్టిలంక మీదుగా గురువారం ఉదయం 12.30 గంటలకు రాజమహేంద్రవరం రూరల్ కడియపు లంకకు చేరుకుంటారన్నారు. అక్కడ మధ్యాహ్న భోజన విరామం అనంతరం వేమగిరి జంక్షన్, బొమ్మూరు జంక్షన్ మీదుగా మోరంపూడి జంక్షన్ నుంచి రాజమహేంద్రవరం సిటీలోకి సీఎం రోడ్డు షో ప్రవేశిస్తుందన్నారు.

ఈ రోడ్ షో వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్, ఆర్టీసీ కాంప్లెక్స్, తాడితోట జంక్షన్, బైపాస్ రోడ్డు, అశోకా థియేటర్, ఆజాద్ చౌక్, దేవీ చౌక్, గోకవరం బస్టాండు, ఆర్యాపురం, మూలగొయ్యి, సీతంపేట, పేపర్ మిల్లు మీదుగా కాతేరు, దివాన్ చెరువు, రాజానగరం వరకూ రోడ్డు షో కొనసాగనున్నదన్నారు. సిటీ పరిధిలో మొత్తం 7 కిలోమీటర్ల మేర సీఎం జగనన్న రోడ్డు షో కొనసాగుతుందన్నారు. ప్రజలంతా తరలివచ్చి పేదలకు సంక్షేమ పాలన అందిస్తున్న జన నేత జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చే విధంగా ప్రజలు ఆశీర్వదించి, మద్దతు తెలియజేయాల్సిందిగా ఎంపీ భరత్ రామ్ అభ్యర్థించారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో గూడూరి రాధిక

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు మద్దతుగా పలువురు బుధవారం పార్టీలో చేరారు. చాగల్లు కౌరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక తిలక్ రోడ్‌లోని ఎంపీ ఎన్నికల కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ సతీమణి, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి రాధిక వారికి పార్టీ కండువాలు వేసి, ఆహ్వానించారు. జగనన్న పాలనకు ఆకర్షితులై వారు పార్టీలో చేరినట్టు నాయకులు కౌరు శ్రీనివాస్ చెప్పారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు అత్యధిక మెజార్టీ సాధించేందుకు తమవంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వింత గంగాధర్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నిఘా బృందాలు సమష్టిగా పని చేయాలి

సిటీ నియోజకవర్గ ఆర్ఓ దినేష్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కోసం ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలెన్స్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు అంకితభావంతో, సమష్టిగా పని చేయాలని సిటీ రిటర్నింగ్ అధికారి, కమిషనరు దినేష్‌కుమార్ అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రవర్తనా నియమావళి తనిఖీ చేసే బృందాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18వ తేదీన నామినేషన్ ప్రకియ ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ కార్యకలాపాలను విస్తృతం చేస్తారని, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. సరైన పత్రాలు లేకుండా ఎవరూ నగదు తీసుకెళ్లరాదని, అటువంటి నగదు దొరికినపుడు నిబంధనలకు అనుగుణంగా ప్రవర్తించాలని చెప్పారు. రూ.10 లక్షల కన్నా ఎక్కువ మొత్తం దొరికితే ఆదాయపు పన్ను శాఖ వారికి సమాచారమిచ్చి, నగదు జప్తు చేయాలన్నారు. అభ్యర్థులతో ర్యాలీలో పాల్గొనే వారి వాహనాలను నిశితంగా పరిశీలించాలన్నారు. పార్టీ జెండాలతో ఉన్న ఆయా వాహనాల ఖర్చు అభ్యర్థి ఖాతాలో వేయాలన్నారు. స్టాటిక్ సర్వైలెన్స్ టీములు నగరంలోకి ప్రవేశించే మార్గాలన్నింటి వద్ద నిఘా వేసి, ప్రతి వాహనాన్ని తనిఖీ చేయకుండా వదలవద్దని ఆదేశించారు. గురువారం నుంచి అన్ని బృందాలు పూర్తి స్థాయిలో పనిచేయాలని, బృందాల పనితీరును రోజువారీ సమీక్ష చేస్తామన్నారు. బృందాలు తిరిగే ప్రతి వాహనానికి జీపీఎస్, డివైస్ అమర్చుతామన్నారు. ప్రచార వాహనాల శబ్దాలను డెసిబెల్స్ పరంగా లెక్కిస్తారని, పరిమితికి మించి శబ్దం వస్తుంటే వాటిని నియంత్రించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో అర్బన్ తహసీల్దార్ కె.ఆంజనేయులు, డిప్యూటి తహసీల్దార్లు, నిఘా బృందాల వారు పాల్గొన్నారు.


రిజర్వ్ పోలీస్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ పి.జగదీష్ దంపతులు


ఎంపీ కార్యాలయంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో ఎంపీ మార్గాని భరత్‌రామ్ దంపతులు


ఏకేసీ కాలేజ్ వద్ద సీతారాముల కల్యాణంలో పాల్గొన్న మేడపాటి షర్మిలారెడ్డి


ధవళేశ్వరంలో శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న చందన నాగేశ్వర్


ధవళేశ్వరంలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

జగమంతా రామమయం

- అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం
- ముత్యాల తలంబ్రాలు.. వేదమంత్రాల నడుమ కమనీయ ఘట్టం
- పల్లకీపై ఊరేగిన పుణ్య దంపతులు


సీతంపేట కోదండ రామాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

సీటీఆర్ఐ: శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం నగరంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వేదమంత్రాలు, ముత్యాల తలంబ్రాలతో రామనామస్మరణ మధ్య స్వామి వారికి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. నగరంలో రామాలయాల్లో ఉదయం నుంచీ సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సీతంపేటలోని రామాలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. జాంపేట వద్ద నున్న కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం సీతారాములను పల్లకీపై ఊరేగించారు. భక్తులకు పులిహోర, గారెలు, వడపప్పు, పానకం పంపిణీ చేశారు. బీజేపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి పురంధేశ్వరి, రాజమహేంద్రి విద్యాసంస్థల అధినేత టీకే విశ్వేశ్వరరెడ్డి సీతంపేటలోని శ్రీరాముని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కల్యాణోత్సవంలో ఎస్పీ దంపతులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జాంపేట రిజర్వ్ పోలీస్ లైన్‌లో కోదండ సీతారాముల కల్యాణ మహోత్సవంలో జిల్లా ఎస్పీ పి.జగదీష్, ఆయన సతీమణి హేమ పీటలపై కూర్చుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ ఘట్టాలను వీక్షించడానికి తరలివచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా పోలీస్ అధికారులు, రామాలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ యంత్రాంగానికి, ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముని ఆశీస్సులతో అందరి జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో, పిల్లాపాపలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు పి.అనిల్‌కుమార్, ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, ఎల్.చించిరెడ్డి, జోనల్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్సైలు, జిల్లా పోలీస్ అధికారుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

వాడవాడలా కల్యాణాలు

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణం బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. వీరవరంలోని పురాతన కోదండ రామాలయంలో స్వామివారి కల్యాణం చేశారు. అలాగే కడియం, వేమగిరి, కడియపులంక, దుళ్ల, మాధవరాయుడుపాలెం, మురమండ, జేగురుపాడు తదితర గ్రామాల్లోని ఆలయాల వద్ద కల్యాణోత్సవాలు నిర్వహించారు. పానకం పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ఆయా గ్రామాల్లోని సీతారాములను దర్శించుకున్నారు. దుళ్లలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద, ఆర్యవైశ్య రామాలయం, చెరువు వీధి రామాలయాల వద్ద భారీ అన్న ప్రసాద వితరణలు భక్తులు, దాతల సహకారంతో ఏర్పాటు చేశారు.

కల్యాణోత్సవంలో ప్రముఖుల సందడి

ధవళేశ్వరం: శ్రీరామనవమి వేడుకలు ధవళేశ్వరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గొల్లపేటలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారాములుకు వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్, పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, తలారి వరప్రసాద్, నారపురెడ్డి మురళి, సత్యం వెంకటరమణ, ఇందల మెహర్ తదితరులు పాల్గొన్నారు. లాక్‌లైన్ క్వార్టర్స్‌లో ఉన్న రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. పోలవరం ప్రాజెక్టు సీఈ బుర్రి సుధాకరబాబు, జయకుమారి దంపతులు పీటలపై కూర్చున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బస్టాండ్ సెంటర్‌లో జరిగిన శ్రీరామనవమి వేడుకలకు డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ నాయకుడు మిరప రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం నగర్: శ్రీరామనవమి సందర్భంగా స్థానిక లలితానగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం దంపతులు కల్యాణంలో పాల్గొని, స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

రామనామమే మానవులకు రక్షణ కవచం

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ


శ్రీరామనవమి సందర్భంగా సీతారాములను దర్శించుకున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: మానవాళికి రామ నామమే రక్షణ కవచమని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. రూరల్ నియోజకవర్గంలో పలు శ్రీరామ నవమి వేడుకల్లో ఆయన పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆల్కాట్‌తోట గుడ్లవారివీధిలో ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి పునర్నిర్మాణం చేసిన రామాలయంలో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో మంత్రి వేణు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఇన్నీసుపేటలోని శ్రీకృష్ణనగర్‌లో పద్మశాలీయుల రామాలయంలోను, బొమ్మూరులోని ఎలక్ట్రికల్‌కొండపై సంతాన సీతారాముల ఆలయాన్ని మంత్రి వేణు సందర్శించారు. కొంతమూరులోని కాతేరు రోడ్డులో ఉన్న రామాలయంలో శ్రీరామనవమి వేడుకల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ శ్రీకృష్ణనగర్ పద్మశాలీయ రామాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. బొమ్మూరులోని సంతాన సీతారాముల ఆలయంలో ఏపీఈపీడీసీఎల్ విశ్రాంత ఎస్ఈ చింతా సత్యనారాయణరెడ్డి, సత్యవేణి దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణం నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిగింది. హుకుంపేట రావిచెట్టు సెంటర్‌లోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. తొర్రేడు గ్రామంలో వందేళ్ల చరిత్ర కల్గిన రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు.

సీతారాముల జీవితం మానవాళికి ఆదర్శం

సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్


ఊరేగింపులో పల్లకీ మోస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: మానవాళికి సీతారాముల జీవితం ఆదర్శమని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. శ్రీరామ నవమి సందర్భంగా ఎంపీ కార్యాలయంలో అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఎంపీ భరత్‌రామ్, మోనా దంపతుల ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ సీతారాముల కల్యాణమంటే మానవాళికి నిజమైన పండగ అని, లోక కల్యాణానికి సంకేతంగా భావిస్తారన్నారు. లోక క్షేమకారకం కావాలన్న శుభ సంకల్పంతో ఏటా సీతారాముల కల్యాణాన్ని తమ కుటుంబం నిర్వహిస్తోందన్నారు. నగరవాసులు అష్టైశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని శ్రీరామచంద్ర ప్రభువును ప్రార్థిస్తున్నామన్నారు. సీతారాముల కరుణా కటాక్షాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, ప్రతి ఒక్కరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు పార్టీ ప్రముఖులు, సీనియర్ నేతలు, కార్యకర్తలు, మహిళా నేతలు విశేష సంఖ్యలో తరలివచ్చారు.


సీతారాముల కల్యాణంలో పాల్గొన్న శివరామ సుబ్రహ్మణ్యం దంపతులు


దుళ్లలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు


బొమ్మూరు సంతాన సీతారామాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న విశ్రాంత ఎస్ఈ చింతాసత్యనారాయణరెడ్డి దంపతులు


ధవళేశ్వరం లాక్‌లైన్ క్వార్టర్స్‌లో కల్యాణోత్సవంలో పాల్గొన్న సీఈ సుధాకరబాబు దంపతులు